ఊరెళ్తున్నారా... సమాచారం ఇవ్వండి



వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వెంకట్

హస్తినాపురం: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్తున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ తెలిపారు. సమాచారం ఇస్తే తాము సంబంధిత కాలనీల్లో గస్తీని మరింత పెంచుతామని అన్నారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ, పండుగకు గ్రామాలకు వెళ్లేవారు బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును ఇంట్లో వదిలి వెళ్లకుండా బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని సీఐ సూచించారు. కాలనీల్లో అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తులు తచ్చాడుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు, 100 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ప్రయాణ సమయంలో అపరిచిత వ్యక్తులు ఇచ్చే ఆహారం తీసుకోవద్దని, బస్టాప్‌లలో ఉన్న రద్దీని ఆసరా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ బ్యాగులు, ఇతర విలువైన వస్తువులు ఎక్కడ పడితే అక్కడ పెట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సీఐ వెంకట్ సూచించారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎవరికి ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సూచించారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చాంద్రాయణగుట్ట: రేషన్ బియ్యాన్ని (పీడీఎస్) నల్ల బజార్‌కు తరలిస్తున్న ఇద్దరిని ఫలక్‌నుమా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ గౌస్, షేక్ రహీం అనే ఇద్దరు వ్యక్తులు మినీ లేల్యాండ్ వాహనంలో రేషన్ బియ్యాన్ని ఫలక్‌నుమా మీదుగా తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ తన సిబ్బందితో కలిసి వాహనాన్ని ఆపి పరిశీలించగా, 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం అందులో ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అయూబ్ పరారీలో ఉన్నాడు. స్థానికంగా లబ్ధిదారుల నుంచి బియాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది.

అనాథలకు అండగా నిలవాలి



అఫ్జల్‌గంజ్: అనాథ చిన్నారులకు ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలని బీజేపీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాస్ అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు సంక్రాంతి సందర్భంగా పిండి వంటలు అందజేసి సంక్రాతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు తరుణ్ యాదవ్, జెల్లా శ్యామ్ యాదవ్, మహేష్ యాదవ్, సుధీర్ సింగ్, ద్వారాక, లచ్చయ్య, అశోక్ యాదవ్, కట్టా రమేష్ ముదిరాజ్, అర్జున్ యాదవ్ పాల్గొన్నారు.

ఆకాశంలో గాలిపటాల గలాటా!

- పతంగుల సంబురాలు షురూ
- దుకాణాల్లో కొలువు దీరిన వెరైటీ గాలిపటాలు
- పోటా పోటీగా ఎగురవేస్తూ యువకుల సందడి







గాలిపటాలకు మాంజా కొనుగోలు చేస్తున్న స్థానికులు

దిల్‌సుఖ్‌నగర్: అంబరాన్నంటే సంక్రాంతి సంబురాలు మొదలయ్యాయి. సంక్రాంతి నేపథ్యంలో చిన్నారులు, యువకులు పతంగులు కొనుగోలు, ఎగురవేయడంలో చేసి బిజీబిజీగా మారారు. మలక్‌పేట్‌జోన్ పరిధిలో ఉదయం నుంచే చిన్నారులు, యువకులు రంగు రంగుల గాలిపటాలను పోటా పోటీగా ఎగుర వేస్తూ సందడి చేస్తున్నారు. అపార్టుమెంట్లు, ఇళ్ల మిద్దెలపై నిలబడి కొందరు.. పార్కులు, ఖాళీ స్థలాల్లో మరికొందరు ఎగుర వేస్తున్నారు.

పలు డిజైన్లలో పతంగులు....

దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, కొత్తపేట్, మలక్‌పేట , సైదాబాద్, మాదన్నపేట, ఐఎస్‌సదన్, కొత్తపేట, ఓల్డ్‌మలక్‌పేట్, అక్బర్‌బాగ్ తదితర ప్రాంతాల్లోని పతంగుల కోసం ప్రత్యేక దుకాణాలు ఏర్పాట్లు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, సినిమా హీరోలు, స్పైడర్‌మెన్, గుడ్లగూబ, గద్ద, పులి బొమ్మలతో అందంగా ముద్రించిన గాలిపటాలను విక్రయిస్తున్నారు. వీటి ధర రూ.10 నుంచి రూ. 500 వరకు పలుకుతోంది.

◆ పతంగులు ఎగువేసేందుకు అతి ముఖ్యమైంది మాంజా(దారం). వివిధ రంగుల్లో రూపొందించిన మాంజాను షాపుల్లో విక్రయిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

◆ అపార్టుమెంట్ గోడలు, ఇళ్లపై గోడలు, పిట్టగోడలు లేని మిద్దెలపై గాలిపటాలు ఎగురవేయడం చాల ప్రమాదకరం.

◆ పతంగులకు చైనా మాంజా కాకుండా స్థానికంగా తయారు చేసిన నాణ్యమైన మాంజాను కట్టాలి.

◆ పార్కులు, మైదానాలు, ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలి.

◆ చిన్న పిల్లలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు పెద్దలు వారిని గమనిస్తూ తగిన సూచనలు ఇవ్వాలి.

◆ గాలిపటాలు ఎగువేసేటప్పుడు వెనక్కి, ముందుకు చూస్తూ కదలాలి. చెర్క పట్టుకోవడానికి వేరొకరి సాయం తీసుకుంటే మంచిది.

◆ విద్యుత్ తీగలకు దగ్గరగా గాలిపటాలు ఎగురవేయరాదు. విద్యుత్ తీగలకు తాకిన పతంగులను సీకులు, కర్రలతో తీయరాదు. అలా చేస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

◆ మాంజా చాలా సున్నితంగా ఉండి చేయి తెగే ప్రమాదం ఉంది. కాబట్టి చేతికి గ్లౌజులు తొడుక్కోవడం లేదా కర్ఛీఫ్ లాంటిది కట్టుకోవడం మేలు.

◆ పతంగులు ఎగురుతున్న సందర్భంలో పక్షులు వాటికి తగిలి చనిపోయే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి పక్షులకు దూరంగా ఎగురవేస్తే వాటిని కాపాడిన వారం అవుతాం.

◆ ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే ప్రథమ చికిత్స చేసి సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి.

త్వరలో అందుబాటులోకి చింతలకుంట ఫ్లైఓవర్



చింతలకుంట వద్ద ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ చింతలకుంట శ్రీకృష్ణానగర్ కాలనీ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఆర్‌డీపీ పనుల్లో భాగంగా చేపట్టిన ఈ ఫ్లైఓవర్ పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బైరామల్‌గూడ వద్ద లూప్ ఆకారంలో నిర్మిస్తున్న సైకి ఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరాయన్నారు. ఈ పనులతో స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 47 ప్రాజెక్టుల్లో భాగంగా 36 ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.

లెవల్స్ పాటిస్తూ డ్రైనేజీ పనులు చేపట్టండి: కొప్పుల



శివంహిల్స్ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కచ్చితమైన లెవల్స్ పాటిస్తూ భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్ పరిధి హయత్‌నగర్‌లోని శివంహిల్స్ కాలనీలో జరుగుతున్న యూజీడీ పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మ్యాన్‌హోల్ టూ మ్యాన్‌హోల్ వాటర్ ఫ్లోటింగ్ చేయించి పరిశీలించినట్లు తెలిపారు. నాసిరకంగా పనులు చేయొద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. హయత్‌నగర్ పరిధిలో మిగిలిపోయిన డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బీజేపీ నేతలు కడారి యాదగిరియాదవ్, పారంద సాయి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ శిల్పారామానికి సంక్రాంతి శోభ



ఉప్పల్ మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా శనివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. హరిదాసులు, భోగిపళ్లు, గంగి రెద్దుల విన్యాసాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆంపీ థియేటర్ వద్ద చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

– ఉప్పల్

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 35, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 32, దొండ 23–28, చిక్కుడు 28–45, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 50, ఆలు 19–25, దోస 23, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 60. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పేదలకు అండ సీపీఐ జెండా: ఆందోజు



మాట్లాడుతున్న రవీంద్రచారి

నాగోలు: దేశ స్వాతంత్ర్యం కోసం అనేక ప్రాణ త్యాగాలు చేసి, పలు ప్రజా సంఘాలను నిర్మించి వారి హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమాలు చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ది అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. నాగోలు డివిజన్ మన్సూరాబాద్‌లోని వాంబే కాలనీలో సీపీఐ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. రవీంద్రచారి ముఖ్యఅతిథిగా హాజరై సభ్యత నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ, దేశంలోని కార్మికులు, కర్షకులు, కష్టజీవుల పక్షపాతిగా సీపీఐ ఎర్ర జెండా పని చేస్తున్నదని తెలిపారు. పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు కందుల సుధాకర్, శాఖ కార్యదర్శి పూజారి అనిత, సహాయ కార్యదర్శి పార్వతమ్మ, పార్టీ నాయకులు గుర్రపు రమేష్, బొంత రామూర్తి, గల లక్ష్మి, భూతం రాధా, పోకల లక్ష్మి, లాల్ పటేష్ సురేష్, లింగస్వామి, మౌనిక, ప్రభుదాస్, సూరారం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి ఠాణాను సందర్శించిన డీసీపీ



చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో డీసీపీ ప్రవీణ్‌కుమార్

చైతన్యపురి: ఇటీవల ఎల్‌బీనగర్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ ప్రవీణ్ కుమార్ శనివారం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలు, వాటి విచారణ తీరును ఇన్‌స్పెక్టర్ నాగార్జునను అడిగి తెలుసుకున్నారు. కేసుల రికార్డులను పరిశీలించారు. సెక్షన్, క్రైం రూమ్‌లను పరిశీలించి స్టేషన్ సిబ్బందికు పలు సూచనలు చేశారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్తే చోరీలు జరగకుండా తీసుకున్న చర్యలు, రాత్రి పెట్రోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నకిలీ సబ్బులు, టీ పౌడర్ గుట్టురట్టు

- తయారీ చేసి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు
- రూ.30 లక్షల నరుకు స్వాధీనం

మలక్‌పేట: ప్రముఖ కంపెనీకి చెందిన సబ్బులు, టీ పౌడర్లను నకిలీవి తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.30 లక్షల విలువైన నకిలీ సబ్బులు, టీ పౌడర్లు, లేబుళ్లను స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట ఎస్‌ఐ జయంత్ తెలిపిన వివరాల ప్రకారం...రాంకోఠికి చెందిన రాకేష్‌జైన్ (46), మహావీర్‌జైన్(37)లు మూసారాంబాగ్‌లో ప్రముఖ సంస్థకు నెందిన నకిలీ మైసూర్ సాండిల్ సబ్బులు, నకిలీ టీ పౌడర్లను తయారు చేసి విక్రయిస్తున్నారని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో వారు మూసారాంబాగ్‌లోని వారి కేంద్రంపై దాడి నిర్వహించి వారి నుంచి రూ. 30 లక్షల విలువైన నకిలీ మైసూర్ సాండిల్ సబ్బులకు చెందిన 50 కార్టన్లు, నకిలీ టీ పౌడర్ 50 బ్యాగులు, లేబుళ్లను స్వాధీనం చేసుకొని నిందితులను తదుపరి దర్యాప్తు నిమిత్తం మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జయంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గుల పోటీలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లో కార్పొరేటర్ మేకల విజయలక్ష్మీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సుమిత్ర ఎన్‌క్లేవ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

సందడిగా సంక్రాంతి సంబురాలు



గడ్డిఅన్నారంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి కమలాసుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సంక్రాంతి సంబురాలు సందడిగా కొనసాగుతున్నాయి. శనివారం వాడవాడలా ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.గంగిరెద్దుల ఊరేగింపులు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. గడ్డిఅన్నారం డివిజన్‌లోని రెడ్డి బ్రదర్స్ రోడ్డులో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సతీమణి కమలా సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ముగ్గుల పోటీల విజేతలకు కమలా సుధీర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. స్వయంగా గాలిపటాలు ఎగరవేసి యువకులను ఉత్సాహపరిచారు. మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్‌ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, రమణారెడ్డి, గండి సన్నీయాదవ్, యాద శంకర్, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, ప్రమీల, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో....

దిల్‌సుఖ్‌నగర్ శ్రీనగర్ కాలనీలో జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. కాలనీవాసులు బ్రహ్మచారి, శ్రీనివాస్, సంతోష్, శ్రీకాంత్, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, దాసరి జయప్రకాష్, షైక్ ఉమర్, సతీష్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.



శ్రీనగర్ కాలనీలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



గంగిరెద్దులను పూజిస్తున్న మహిళలు

'మార్కెట్ కమిటీ'పై ఆశావహుల గురి

కమిటీల రద్దు ప్రకటనతో పైరవీలు షురూ



హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

చాదర్‌ఘాట్: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. నామినేటెడ్ పోస్టుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు కీలకం కాగా సీనియర్, జూనియర్ కాంగ్రెస్ నాయకులు మలక్‌పేట నియోజకవర్గంలో అప్పుడే పైరవీలు మొదలుపెట్టారు. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన వారు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పోస్టులకు కన్నేశారు.

రిజర్వేషన్ ఉంటుందా?

గత ప్రభుత్వం మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్ విధానం అమలు చేసి, పాలకవర్గంలో 11 మంది సభ్యులుగా ఉండేలా చేసింది. తొలుత పాలకవర్గం పదవీ కాలం ఏడాది కాగా, తదుపరి రెండేళ్లకు పెంచింది. ఓసీ జనరల్, ఎస్‌సీ మహిళ, ఓసీ జనరల్, బీసీ–డీ, అనంతరం ఓసీ మహిళగా అమలవుతుంది. ఈసారి రిజర్వేషన్ ఉంటుందో లేదో చూడాలి.

మార్కెట్ ఆదాయం రూ. 14 కోట్లు...

మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆదాయం రూ. 14 కోట్లు వస్తోంది. రాష్ట్రంలోనే ఈ మార్కెట్‌కు ఆదాయం ఎక్కువ వస్తుంది. ప్రభుత్వం కూడా ఈ మార్కెట్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

చైర్మన్ పోస్ట్ ఎవరిని వరించేనో..

మలక్‌పేట నియోజకవర్గం నుంచి చైర్మన్ పోస్టు కోసం కోట్ల శ్రీనివాస్, కిషన్‌సింగ్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, రాధిక, జి.కృష్ణ, రాధిక, కె.శ్రీకాంత్, ధనుంజయ్, మదన్‌బాబు, బాబు శ్రీనివాస్ తదితరులు జోరుగా పైరవీలు చేస్తున్నారు. ఎవరిని చైర్మన్ పోస్ట్ వరిస్తుందో వేచి చూడాల్సిందే.